# పోలింగ్ కేంద్రాల్లో వసతులు కల్పించాలి


సమావేశంలో అదనపు కలెక్టర్ బీఎస్ లత

- మౌలిక వసతులు కల్పించాలి
- ఎలాంటి ఇబ్బందులు లేకుండా చూడాలి
- అడిషనల్ కలెక్టర్ బీఎస్ లత
- అధికారులతో జూమ్ కాన్ఫరెన్స్

జగిత్యాల కలెక్టరేట్, అక్టోబర్ 12: అసెంబ్లీ ఎన్నికల నేపథ్యంలో జిల్లాలోని అన్ని పోలింగ్ కేంద్రాల్లో ఓటర్లకు, పోలింగ్ సిబ్బందికి అవసరమైన మౌలిక వసతులు కల్పించాలని జిల్లా డిప్యూటీ ఎలక్షన్ ఆఫీసర్, అదనపు కలెక్టర్ బీఎస్ లత అన్నారు. ఎన్నికల నిర్వహణకు తీసుకోవాల్సిన చర్యలు, మౌలిక వసతులపై ఆర్డీవోలు, తహసీల్దార్లు, ఇంజినీరింగ్ అధికారులతో ఆమె గురువారం జూమ్ కాన్ఫరెన్స్ నిర్వహించారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ, జిల్లాలోని అన్ని పోలింగ్ కేంద్రాల్లో తాగు నీరు, విద్యుత్, మరుగుదొడ్లు, ర్యాంపులు, రెయిలింగ్స్, ఫర్నీచర్ వంటి సౌకర్యాలు ఉండేలా చర్యలు తీసుకోవాలన్నారు. పోలింగ్ కేంద్రాల్లోని విద్యుత్ స్విచ్ బోర్డులు, ఫ్యాన్లు, ఇతర విద్యుత్ పరికరాల పనితీరును పరిశీలించి అవసరమైన మరమ్మతులు చేపట్టాలన్నారు. మరుగుదొడ్లు లేని చోట ఉపాధి హామీ పథకం కింద వెంటనే మరుగుదొడ్లు నిర్మించాలన్నారు. ఎన్నికలు సజావుగా, ఎలాంటి అసౌకర్యాలు కలుగకుండా తగిన జాగ్రత్తలు తీసుకోవాలన్నారు. సమావేశంలో ఆర్డీవోలు నర్సింహమూర్తి, రాజేశ్వర్, తహసీల్దార్లు, ట్రాన్స్‌కో, పంచాయతీరాజ్ ఇంజినీరింగ్ అధికారులు తదితరులు పాల్గొన్నారు.

# ఊరూరా ఘన స్వాగతం..

- కొడిమ్యాల మండలంలో ఎన్నికల ప్రచారం
- బీఆర్ఎస్ అభ్యర్థి సుంకెకు ఘన స్వాగతం పలికిన నాయకులు, మహిళలు
- మా ఓటు బీఆర్ఎస్‌కే అంటూ నినాదాలు


ప్రచారంలో మాట్లాడుతున్న ఎమ్మెల్యే సుంకె రవిశంకర్

కొడిమ్యాల, అక్టోబర్ 12: మండలంలోని ఆరు గ్రామాల్లో చొప్పదండి ఎమ్మెల్యే సుంకె రవిశంకర్ ఎన్నికల ప్రచారం నిర్వహించగా, ఆయా గ్రామాల్లో మహిళలు, వివిధ కుల సంఘాల నాయకులు ఘన స్వాగతం పలికారు. డప్పు చప్పుళ్లతో స్వాగతం పలికారు. నాచుపల్లి, కొడిమ్యాల గ్రామాల్లో ఎమ్మెల్యేకు పూలు చల్లుతూ ఘన స్వాగతం పలికారు. సుంకె రవిశంకర్‌కే మా మద్దతు అంటూ నినాదాలు చేశారు. కార్యక్రమంలో ఎంపీపీ మేన్నేని స్వర్ణలత, జడ్పీటీసీ పునుగోటి ప్రశాంతి, సింగిల్ విండో చైర్మన్ మేన్నేని రాజనర్సింగరావు, సర్పంచుల ఫోరం మండలాధ్యక్షుడు పునుగోటి కృష్ణారావు, వైస్ ఎంపీపీ ప్రసాద్, సర్పంచులు ఏలేటి మమత-నర్సింహారెడ్డి, సయ్యద్ హైదర్, ఉట్కూరి రాజశేఖర్‌రెడ్డి, గుంటి లక్ష్మీదేవి, సామంతుల ప్రభాకర్, అంబటి లత-తిరుమలేశ్, ఏగుర్ల తిరుపతి, భూక్యా బొజ్జానాయక్, గరిగంటి మల్లేశం, ఎంపీటీసీలు మల్యాల సుజాత-శోభన్, ఉట్కూరి మల్లారెడ్డి, సామల్ల లక్ష్మణ్, కో ఆప్షన్ సభ్యుడు నసిరొద్దీన్, బీఆర్ఎస్ మండలాధ్యక్షుడు పులి వెంకటేశంగౌడ్, రైతు బంధు సమితి మండలాధ్యక్షుడిగా అంకం రాజేశం, నాయకులు గుంటి తిరుపతి, చాంద్‌పాషా, నేరెళ్ల మహేశ్, గుండు రాజ్‌కుమార్, లింగంపల్లి నరేందర్, సింగిరెడ్డి తిరుపతిరెడ్డి, దశరథం,గడ్డం లక్ష్మారెడ్డి, సురభి సాగర్‌రావు, కాయిత రాజు, తదితరులున్నారు.


బెల్లం పానకాన్ని పారబోస్తున్న పోలీస్, ఎక్సైజ్ అధికారులు, సిబ్బంది

## గుడుంబా స్థావరాలపై దాడులు

- మద్దులపల్లిలో 700 లీటర్ల బెల్లం పానకం ధ్వంసం
- 10 లీటర్ల గుడుంబా, 20 కిలోల బెల్లం స్వాధీనం
- ఒకరిపై కేసు నమోదు
- దాడుల్లో పాల్గొన్న జగిత్యాల ఎక్సైజ్ సూపరింటెండెంట్ శ్రీధర్

పెగడపల్లి, అక్టోబర్ 12: మద్దులపల్లి గ్రామ గిరిజన తండాపై జగిత్యాల ఎక్సైజ్ శాఖ, పెగడపల్లి పోలీస్ అధికారులు గురువారం మెరుపు దాడులు చేశారు. జగిత్యాల ఎక్సైజ్ సూపరింటెండెంట్ శ్రీధర్ ఆధ్వర్యంలో చేపట్టిన ఈ దాడుల్లో మద్దులపల్లి తండాలో గుడుంబా కోసం సిద్ధం చేసిన 700 లీటర్ల బెల్లం పానకాన్ని ధ్వంసం చేయడంతో పాటు, 20 కిలోల బెల్లం, 10 లీటర్ల గుడుంబాను స్వాధీనం చేసుకున్నారు. గుడుంబా తయారు చేస్తున్న ఓ వ్యక్తిపై కేసు నమోదు చేశారు. ఈ సందర్భంగా జగిత్యాల ఎక్సైజ్ సూపరింటెండెంట్ శ్రీధర్ మాట్లాడుతూ.. దసరా పండుగతో పాటు, ఎన్నికల నేపథ్యంలో తండాల్లో గుడుంబా పెద్ద మొత్తంలో తయారు చేస్తున్నట్లు సమాచారం రావడంతో దాడులు చేపట్టినట్లు తెలిపారు. ఎవరైనా గుడుంబా తయారు చేసినా, విక్రయించినా నేరమని, చట్టరీత్యా చర్యలు తీసుకుంటామని ఆయన హెచ్చరించారు. కార్యక్రమంలో అడిషనల్ ఎక్సైజ్ సూపరింటెండెంట్ బీవీఎన్ నాయక్, ఎక్సైజ్ సీఐలు ప్రభాకర్‌రెడ్డి, అశోక్, పెగడపల్లి, ఎక్సైజ్ ఎస్ఐలు సీహెచ్ సతీశ్, రవి, సిబ్బంది పాల్గొన్నారు.

# ఫిట్ ఇండియా ఫ్రీడం రన్



ఫ్రీడం రన్‌లో పాల్గొన్న అధ్యాపకులు, విద్యార్థులు

జగిత్యాల టౌన్, అక్టోబర్ 12: పొలాస వ్యవసాయ కళాశాలలో ఎన్ఎస్ఎస్ యూనిట్, వ్యవసాయ కళాశాల ఆధ్వర్యంలో 40 మంది ఎన్ఎస్ఎస్ వలంటీర్లతో ఫిట్ ఇండియా ఫ్రీడం రన్ 4.0ను వ్యవసాయ కళాశాల అసోసియేట్ డీన్ డాక్టర్ భారతి భట్ ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ, మెరుగైన ఆరోగ్యం, ఫిట్‌నెస్ కోసం నడక, పరుగెత్తే అలవాటును పెంపొందించుకోవాలన్నారు. ఫిట్ ఇండియా స్వచ్ఛతా ఫ్రీడం రన్‌ను అక్టోబర్ 1 నుంచి 31వ తేదీ వరకు స్వచ్ఛ భారత్, స్వస్థ్ భారత్‌లో భాగంగా నిర్వహిస్తున్నట్లు తెలిపారు. కార్యక్రమంలో ఎన్ఎస్ఎస్ ప్రోగ్రాం ఆఫీసర్లు డాక్టర్ టీ ఎల్లాగౌడ్, డాక్టర్ వీ రత్నాకర్, అధ్యాపకులు డాక్టర్ ఓ సంపత్, డాక్టర్ ఆర్ సాయికుమార్, సిబ్బంది, విద్యార్థులు పాల్గొన్నారు.

## నిత్యావసర సరుకుల అందజేత


నిత్యావసర సరుకులు అందిస్తున్న సభ్యులు

సారంగాపూర్, అక్టోబర్ 12: లక్ష్మీదేవిపల్లి గ్రామానికి చెందిన మలావత్ జల నిరుపేద కుటుంబానికి గురువారం జగిత్యాల జిల్లా సహాయక బృందం ఆధ్వర్యంలో 25 కిలోల బియ్యం, 15 రకాల నిత్యావసర సరుకులు, వెయ్యి నగదు అందజేశారు. మలావత్ జల భర్త సంవత్సరం క్రితం క్యాన్సర్‌తో మృతి చెందాడు. వీరికి ఇద్దరు చిన్న పిల్లలు ఉన్నారు. వీరిది నిరుపేద కుటుంబం కావడంతో విషయం తెలుసుకున్న జిల్లా సహాయక బృందం సభ్యులు సహకారం అందించారు. ఈ సందర్భంగా సహాయక బృంద సభ్యులను పలువురు అభినందించారు. కార్యక్రమంలో సీనియర్ సభ్యులు మహ్మద్ అస్లాం, దొంతి మధు, పాలిక శేఖర్, తోట హరీశ్, వడ్లూరి శేఖర్, పంచతి అరవింద్, సురేశ్ పాల్గొన్నారు.

## మంత్రి ప్రశాంత్‌రెడ్డికి మాతృవియోగంపై సంతాపం

జగిత్యాల రూరల్, అక్టోబర్ 12: రాష్ట్ర ఆర్అండ్‌బీ శాఖ మంత్రి వేముల ప్రశాంత్ రెడ్డి మాతృమూర్తి వేముల మంజులమ్మ మృతిపై జగిత్యాల ఎమ్మెల్యే డాక్టర్ సంజయ్ కుమార్ సంతాపం ప్రకటించారు. మంజులమ్మ మృతి బాధాకరం అని, ఆమె ఆత్మకు శాంతి కలగాలని, వారి కుటుంబ సభ్యులకు దేవుడు మనోధైర్యం కలిగించాలని ఆకాంక్షించారు.

## బాధిత కుటుంబానికి ఎమ్మెల్యే సంజయ్ పరామర్శ


పరామర్శిస్తున్న ఎమ్మెల్యే డాక్టర్ సంజయ్ కుమార్

జగిత్యాల రూరల్, అక్టోబర్ 12: జిల్లా కేంద్రంలోని 11వ వార్డుకు చెందిన అఫ్జల్ భార్య మరణించగా వారి కుటుంబ సభ్యులను ఎమ్మెల్యే సంజయ్ కుమార్ పరామర్శించారు. ఆయన వెంట కౌన్సిలర్ బాలె లత -శంకర్, బీఆర్ఎస్ పట్టణ ఉపాధ్యక్షుడు తాజొద్దీన్, మజీద్, సదర్, రహీం, అమీర్, జాకీర్, మంజూర్, సాదుల్ల, తదితరులు ఉన్నారు.

## ముత్యంపేటలో పలువురికి సుంకె పరామర్శ


పరామర్శిస్తున్న ఎమ్మెల్యే సుంకె

మల్యాల, అక్టోబర్ 12: ముత్యంపేట గ్రామానికి చెందిన పద్మశాలీ సంఘ నాయకుడు ముల్క మల్లయ్య సతీమణి గంగవ్వ గుండెపోటుతో మరణించడంతో వారి కుటుంబ సభ్యులను ఎమ్మెల్యే సుంకె రవిశంకర్ పరామర్శించారు. ఈ సందర్భంగా చొప్పదండి ఎమ్మెల్యే సుంకె రవిశంకర్, మాజీ ఎమ్మెల్యే బొడిగె శోభ, కాంగ్రెస్ నాయకుడు మేడిపల్లి సత్యం, జడ్పీటీసీ కొండపలుకుల రామ్మోహన్‌రావు, సర్పంచుల ఫోరం మండలాధ్యక్షులు మిట్టపల్లి సుదర్శన్‌తోపాటు పలు గ్రామాల ప్రజాప్రతినిధులు పరామర్శించారు. ఈ సందర్భంగా గంగవ్వ మృతికి గల కారణాలను అడిగి తెలుసుకోవడంతోపాటు వారి కుటుంబ సభ్యులకు తమ ప్రగాఢ సానుభూతిని తెలిపారు. వారి వెంట ముత్యంపేట సర్పంచ్ బద్దం తిరుపతిరెడ్డి, నాయకులు కోటేశ్వర్‌రావు, సురేందర్, రాజేశ్వర్‌రెడ్డి, జనగాం శ్రీనివాస్, దారం ఆదిరెడ్డి, బత్తిని శ్రీనివాస్‌గౌడ్, బొట్ల ప్రసాద్ తదితరులు పాల్గొన్నారు.

## నేడు మల్యాలలో ఎన్నికల ప్రచారం

మల్యాల, అక్టోబర్ 12: చొప్పదండి ఎమ్మెల్యే, బీఆర్ఎస్ పార్టీ అభ్యర్థి సుంకె రవిశంకర్ శుక్రవారం మల్యాల మండలంలో ఎన్నికల ప్రచారం నిర్వహించనున్నట్లు బీఆర్ఎస్ మండలాధ్యక్షుడు జనగాం శ్రీనివాస్ ఒక ప్రకటనలో తెలిపారు. ఈ సందర్భంగా ఉదయం 8 నుంచి మ్యాడంపల్లి గ్రామంలో ప్రచార యాత్ర ప్రారంభమై మానాల, తక్కళ్లపల్లి, లంబాడిపల్లి, కొంపల్లి, తాటిపల్లి, సర్వాపూర్, గుడిపేట గ్రామాల మీదుగా సాయంత్రం 5 గంటల వరకు ప్రచార యాత్ర కొనసాగనుందన్నారు. మండలంలోని బీఆర్ఎస్ పార్టీకి చెందిన ప్రజాప్రతినిధులు, నాయకులు, కార్యకర్తలు అధిక సంఖ్యలో పాల్గొని సుంకె రవిశంకర్‌కు మద్దతుగా ప్రచారంలో పాల్గొని విజయవంతం చేయాలని కోరారు.

## ఆలయానికి రూ.50 వేల విరాళం

కొడిమ్యాల, అక్టోబర్ 12: మండలకేంద్రంలో నిర్మిస్తున్న శ్రీ లక్ష్మీ వేంకటేశ్వర ఆలయ పునర్నిర్మాణంలో భాగంగా గ్రామానికి చెందిన గుర్రం అరుణ్ కుమార్-స్వప్న దంపతులు ఆలయానికి రాజపోషకులుగా రూ.50,116 నగదును విరాళంగా అందజేశారు. ఈ సందర్భంగా ఆలయ పూజారి నాగరాజు రమేశ్‌కు అందజేయగా ఆలయంలో స్వామివారిని దర్శింపజేసి తీర్థప్రసాదాలు అందచేశారు. కార్యక్రమంలో ఆలయ కమిటీ సభ్యులు పాల్గొన్నారు.


విరాళం అందజేస్తున్న అరుణ్‌కుమార్ కుటుంబ సభ్యులు